
సాక్షి పల్నాడు

సోమవారం । 20 । జనవరి । 2025



గుడికి రూ.5,01,116 విరాళం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం మహంకాళి గుడి పునర్నిర్మాణానికి దమ్మాలపాడుకు చెందిన నన్నపనేని సుబ్బారావు, నారాయణమ్మ దంపతులు రూ.5,01,116 అందజేశారు.



సాగర్ నీటి మట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 560.50 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 9,900 క్యూసెక్కులు విడుదలవుతోంది.



లక్ష్మీకుబేర వ్రతం

కారెంపూడి: షిరిడి సాయి ఆలయంలో ఆదివారం మహిళలు లక్ష్మీ కుబేర వ్రతాన్ని ఆచరించారు. 108 మంది మహిళలు వ్రతాన్ని ఆచరించారు.

న్యూస్‌రీల్

వేమన పద్యం అజరామరం



యడ్లపాడు: తెలుగు జాతి, సంస్కృతి ఉన్నంత కాలం వేమన పద్యం నిలిచే ఉంటుందని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డీవీ నరసింహదీక్షిత్ చెప్పారు. కొండవీడుకోట యోగి వేమన మండపం వద్ద పల్నాడు జిల్లా అటవీశాఖ, కొండవీడు హెరిటేజ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో వేమన జయంత్యుత్సవాలు జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ మహాకవి వేమన పద్యాలు ప్రజల గుండెచప్పుడన్నారు. సంఘ సంస్కరణ కోసం.. సమానత్వం కోసం.. ఆత్మతత్వ వికసిత కోసం ఆటవెలది పద్యాన్ని ఈటెగా విసిరిన దిట్ట వేమన అన్నారు. వేమన చెప్పిన ప్రతిపద్యం తెలుగు సాహిత్య వైభవాన్ని ప్రపంచ వేదికపై చాటుతోందన్నారు. కొండవీడు హెరిటేజ్ సొసైటీ ప్రతినిధి కల్లి శివారెడ్డి మాట్లాడుతూ వేమన వంటి కవిలేరని, ఊరు కొండవీడు, ఉనికి పశ్చిమవీధి అని, కొండవీడు వాసిగా తన పద్యంలో స్వయంగా చాటుకున్న కవి వేమన అన్నారు. శ్రీనాథ సాహిత్య పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి మాట్లాడుతూ వేమన పద్య వెలుగుల్ని ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత సీపీ బ్రౌన్‌కు దక్కుతోందన్నారు. కొండవీడు ఫారెస్టు బీట్ ఆఫీసర్ కొడాలి వెంకటేశ్వరరావు, ఎస్.జయసూర్య ప్రసంగించిన వారిలో ఉన్నారు. ముందుగా మండపం వద్ద ఉన్న వేమన విగ్రహానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొండవీడు ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులు వల్లించిన వేమన పద్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పద్య పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 1,818 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 92, బ్యాంక్ కెనాల్‌కు 144, తూర్పు కెనాల్‌కు 206, పశ్చిమ కెనాల్‌కు 107 , నిజాంపట్నం కాలువకు 110, కొమ్మమూరు కాలువకు 666 క్యూసెక్కుల చొప్పున వదిలారు.

(ఇంగ్లిషు విద్యతో) జీవితానికి భరోసా

- మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- శభాష్... పదో తరగతి పిల్లలు
- ఇంగ్లిషు మీడియంలో పరీక్షలకు సిద్ధమవడం అభినందనీయం
- స్వగ్రామంలో 15 ఏళ్లపాటు ట్యూషన్లు చెప్పించాం..
- తమ వర్గాల అభ్యున్నతికి అట్టడుగు జాతులూ కృషి చేయాలి
- 'సాక్షి'తో రిటైర్డ్ జడ్జి మోపర్తి ప్రకాశరావు



సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: చదువు ముఖ్యం. అది మాతృభాషలోనైనా, పరాయిభాషలో అయినా. మాతృభాష స్థానికంగా, ఇంగ్లిషు విశ్వ వ్యాప్తంగా అవకాశాలను కల్పిస్తుంది. అందువల్లే ఆంగ్లానికి ప్రాధాన్యం పెరిగింది. జీవితానికి భరోసా తప్పకుండా ఇస్తుంది. నాలాంటి పేదింటి పిల్లలు ఆంగ్లంతో పడిన కష్టాలు ఇతరులకు రాకూడదనే ఉద్దేశంతో పదిహేనేళ్ల పాటు గ్రామస్తుల సహకారంతో మా ఊర్లో ట్యూషన్లు చెప్పించామంటారు రిటైర్డ్ జూనియర్ సివిల్ జడ్జి మోపర్తి ప్రకాశరావు. ఆంధ్రప్రదేశ్‌లోని పదో తరగతి విద్యార్థులు 93 శాతం మంది ఇంగ్లిషు మీడియంలో పబ్లిక్ పరీక్షలు రాయడానికి సంసిద్ధతను వ్యక్తం చేయడం సాధారణ విషయం కాదు. వారందరికీ ముందస్తు శుభాకాంక్షలు. వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం విద్యకు ఇచ్చిన ప్రాధాన్యానికి ఇదొక నిదర్శనం. నాడు- నేడు ద్వారా విద్యాసంస్థల్లో రూపురేఖలు మార్చడానికి, వసతులు, వనరులు పెరగడానికి, ఉపాధ్యాయుల్లో మరింత నిబద్ధతను పెంపొందించడానికి ఉపకరించిందని ఆయన అభిప్రాయపడ్డారు.

మోపర్తి ప్రకాశరావు మాటల్లో..

మాది పూర్వపు గుంటూరు జిల్లా అమర్తలూరు మండలం బోడపాడు గ్రామం. నా వయసు ఇప్పుడు 83. జూనియర్ సివిల్ జడ్జిగా 23 ఏళ్ల కిందట రిటైరయ్యాను. తెనాలి చుట్టుపక్కల ప్రాంతాల వారు విద్య ప్రాధాన్యాన్ని గుర్తెరిగిన వారు. పేద కుటుంబానికి చెందిన నాకూ చదువుకునే అవకాశాన్ని తల్లిదండ్రులు కల్పించారు. మాతృభాషలో విద్యనభ్యసించిన నేను ఇంగ్లిషులో కనీస ప్రావీణ్యతకు కుస్తీ పట్టక తప్పలేదు. ఆ దృష్ట్యానే బిడ్డలకు ఇంగ్లిషు చదువుల అవసరాన్ని గుర్తించాను. ఆంగ్లంలో చదువుకుంటే అంతర్జాతీయంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయనడంలో సందేహం లేదు.

నాటికి, నేటికి పరిస్థితులు వేరు..

పూర్వం ప్రభుత్వ బడులలో ఉపాధ్యాయులు బాధ్యతగా చదువు చెప్పేవారు. అందుకు ప్రధాన కారణం ప్రైవేటు బడులు లేకపోవడం. ఉన్నత వర్గాల వారి పిల్లలు ఆ బడుల్లోనే చదువుకోవాల్సిన తప్పని పరిస్థితి. దీంతో గ్రామాల్లోని మోతుబరులు, అగ్రవర్ణాల వారు పంతుళ్లు చదువులు ఎలా చెపుతున్నారనే దానిపై ఓ కన్నేసి ఉంచేవారు. వారి పిల్లలతోపాటు నాలాంటి పేదింటి పిల్లలకు కూడా చదువు అబ్బేది. ప్రైవేటు కాన్వెంట్లు వచ్చాక గవర్నమెంట్ బడుల స్థితిగతులు మారాయి. ప్రభుత్వాలు అంతగా దృష్టి పెట్టలేకపోయాయి.

పే బ్యాక్ టు సొసైటీ..

అంబేడ్కర్ ఆశయాల మేరకు, ఆయన పిలుపు ప్రకారం ప్రతి ఒక్కరూ సొసైటీకి తిరిగి ఇచ్చేయాలి (పే బ్యాక్ టు సొసైటీ). ప్రతి గ్రామంలో, ప్రతి ప్రాంతంలో చదువుకున్న వారు, ఉద్యోగాలు చేసే వారు, రిటైర్ అయిన వారుంటారు. ఎవరంతట వారు, తమ ఆదాయంలో ఒకటి, రెండు శాతం పేద పిల్లలకు మెరుగైన చదువు చెప్పించటానికి వెచ్చించగలిగితే మంచిది. అదే సమాజానికి వారు చేసే పెద్ద మేలవుతుంది. విద్య ఉంటే మెజార్టీ వ్యక్తుల్లో మంచి మాట, ప్రవర్తన, జీవనం ఉంటుంది. వ్యసనాలు దరిచేరవు. తనతోపాటు కుటుంబం, తద్వారా సమాజం బాగుపడుతుంది. మా వరకు దాదాపు పదిహేనేళ్లపాటు పొన్నూరు నుంచి మాస్టర్లను పిలిపించి బోడపాడులోని ప్రైమరీ, హైస్కూల్ విద్యార్థులకు ప్రైవేటుగా ట్యూషన్లు చెప్పించాం. కరోనా వల్ల ఆ ప్రక్రియ ఆగింది. ఇప్పుడేమో వయసు పెరిగినందున హైదరాబాద్ వచ్చా. అయినా పొన్నూరు, చీరాల నుంచి మాస్టర్లను పిలిపించి కనీసం ఇంగ్లిషు, మ్యాథ్స్ సబ్జెక్టులకు ట్యూషన్లు చెప్పించాలనే ఆలోచనల్లో ఉన్నాం. ఎంతవరకు సాధ్యమో చూడాలి. విద్యావంతులు పల్లెల వైపు దృష్టి సారించాలి, వాటి బాగుకు యత్నించాలని విన్నవించారు మోపర్తి ప్రకాశరావు.

జగన్ పేదింటి పిల్లల అవసరాలను గుర్తించారు..

తన సుదీర్ఘ పాదయాత్రలో పేదల స్థితిగతులను, వారి అవసరాలను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పష్టంగా గుర్తించారు. బహుశా అందుకే విద్య, వైద్యం, వ్యవసాయంపై ప్రత్యేకంగా దృష్టి సారించారనిపిస్తుంది. ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిషు విద్య అవసరాన్ని గుర్తించే ప్రాధాన్యమిచ్చారు. సజావుగా ఆలోచించే టీచర్లు తమ బాధ్యతలను గుర్తించి పనిచేశారు. ఆ ఫలితమే ఈ దఫా 93 శాతం మంది పదో తరగతి విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో పరీక్షలకు సంసిద్ధత వ్యక్తం చేయడం. ప్రస్తుత ప్రభుత్వం కూడా పేద పిల్లల బాగు కోసం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ప్రతికూలీంచిన పరిస్థితి



నాట్లకు దమ్ము చేసి సిద్ధంగా ఉన్న పొలంలో యాతకు సిద్ధమైన దాళ్వా వరి నారు

వరి నాట్లకు కూలీల కొరత

- యూపీ, బెంగాల్, బిహార్ రాష్ట్రాల నుంచి కూలీలు
- వరి నారు వయస్సుపైనే ఆధార పడిన దిగుబడి

రొంపిచర్ల: రబీలో వరి సాగును కూలీల కొరత వేధిస్తోంది. దీంతో ఉత్తర ప్రదేశ్(యూపీ), బిహార్, బెంగాల్ నుంచి కూలీలను రైతులు తీసుకొస్తున్నారు. ప్రస్తుతం మండలంలోని చాకలికుంట తండా, కొత్తపల్లి, ఎడ్వర్డ్‌పేట, రెడ్డిపాలెం, మర్రిచెట్టుపాలెం, దాసరిపాలెం, మాచవరం, విప్పర్ల గ్రామాల్లో దాళ్వా వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సార్వాలో కూడా ఈ గ్రామాల్లోని రైతులు ముందుగా వరి సాగు చేసి డిసెంబర్ నెలాఖరుకే వరి కోతలు, నూర్పిళ్ళు పూర్తి చేసి ధాన్యాన్ని ఇంటికి చేర్చుకున్నారు. డిసెంబర్ నెలలో దాళ్వా వరి నారుమళ్లు సాగుచేశారు. మండలంలో మిగిలిన గ్రామాల్లో ఈ తరుణంలో వరి హార్వెస్టింగ్ కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో కూలీలకు మహా గిరాకీ ఏర్పడింది. కొన్ని గ్రామాల్లో ఏకకాలంలో సార్వా వరి నూర్పిళ్ళు ముమ్మరంగా సాగుతుండగా మరి కొన్ని గ్రామాల్లో దాళ్వా వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే రైతులు 10 వేల ఎకరాలకు సరిపడా దాళ్వా వరి నారుమళ్లు సాగుచేశారు. కూలీల లభ్యత తక్కువగా ఉండడంతో నాట్లు ఆలస్యం అవుతున్నాయి. ఇప్పటికి నాలుగు వేల ఎకరాల్లోనూ వరి నాట్లు పూర్తికాలేదు. వరి నారు యాతకు సిద్ధమై పరువం మించి పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జనవరి మొదటి వారంలో ఎకరా దాళ్వా వరి నాట్లు వేసేందుకు రూ.3,500 నుంచి రూ.4,000 వరకే ఖర్చు అయ్యేది. ఒక్కసారిగా రైతులందరికీ వరి నారు సిద్ధం కావటంతో కూలీలు అవసరం మేర అందుబాటులో లేరు. దీంతో ఉత్తరప్రదేశ్, బెంగాల్, బిహార్ రాష్ట్రాల నుంచి కూలీలను రప్పించుకొని నాట్లు వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఎకరా వరి నాట్లు వేసేందుకు కూలీలకు రూ.5 వేలు చెల్లించి వారికి వసతి, వంట చెరుకును కూడా రైతులు అందిస్తున్నారు. సార్వాలో వచ్చిన వరి దిగుబడులను కౌలు చెల్లింపులు పోను మిగిలిన ధాన్యాన్ని అమ్మి రైతులు దాళ్వా పెట్టుబడులకు ఖర్చు చేస్తున్నారు. దాళ్వాలో కూడా సార్వా లాగానే దిగుబడులు వస్తే వరి సాగు చేసిన వారికి కొంత ఆదాయం ఉంటుందని ఆశాభావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.



దాళ్వా వరినాట్లు వేస్తున్న కూలీలు

కూలీలు దొరకడంలేదు



8 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. నారు పోశా. కూలీలు దొరకడంలేదు. నారు వయస్సు 30 రోజులు దాటుతుంది. కూలి రేట్లు పెరిగాయి. ఎకరా నాటు వేసినందుకు రూ.5 వేలు చెల్లించి, వసతి చూపించి, వంట చెరుకు చ్చి, పొలాలకు వెళ్లి వచ్చేందుకు ఆటో సౌకర్యం కల్పిస్తున్నాం.

– బందారు సైదయ్య, రైతు, విప్పర్ల

వరినారు ముదిరితే దిగుబడి తగ్గుతుంది



దిగుబడి వరి నారు వయస్సుపై ఆధారపడి ఉంటుంది. తక్కువ రోజుల్లో ఉన్న వరి నారును పొలంలో నాటితే ఎక్కువ పిలకలు వచ్చి అధిక దిగుబడి వస్తుంది. అందుకే సకాలంలో నాట్లు వేయాలని ఆత్రుత పడుతున్నాం. కూలీల కొరత వల్ల ఎక్కువ రేటు చెల్లిస్తున్నాం.

– సైదా సొహెబ్, రైతు, విప్పర్ల

అద్దంకితో విడదీయలేని అనుబంధం

ప్రకాశం పంతులు మునిమనవరాలు



అద్దంకి రూరల్: అద్దంకితో తమ కుటుంబానికి ఉన్న బంధం విడదీయలేనిదని టంగుటూరి ప్రకాశం పంతులు ముని మనవరాలు సుభాషిణి అన్నారు. ఆదివారం కుటుంబ సమేతంగా అద్దంకి వచ్చారు. స్థానిక బంగ్లా రోడ్డులోని ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన ముత్తాత ప్రకాశం పంతులుగారు ఆంధ్ర రాష్ట్రానికి మొట్టమొదటి ముఖ్యమంత్రి కావడం ఎంతో గర్వకారణమని తెలిపారు. తనకు ఏమీ ఉంచుకోకుండా దేశానికి అర్పించిన త్యాగధనుడని పేర్కొన్నారు. అద్దంకిలో ఆయన తిరిగిన ప్రదేశాలు, చదువు తదితర వివరాలు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సుభాషిణి భర్త విజయ శంకర్, సృజన అధ్యక్షుడు గాడేపల్లి దివాకరదత్తు, జ్యోతిష్మతి, లెవీ ప్రసాద్, షేక్ మహమ్మద్ రఫీ, నరసింహారావు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ పోయే క్లస్టర్ విధానం వచ్చే!



కాంప్లెక్స్ నుంచి తప్పించిన బృగుబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

- స్కూల్ కాంప్లెక్స్‌లను క్లస్టర్లుగా విలీనం
- క్లస్టర్ ప్రధానోపాధ్యాయులకు అధికారాలు
- నియోజకవర్గంలో 18 కాంప్లెక్స్‌లను 16 క్లస్టర్లుగా కుదింపు

సత్తెనపల్లి: విద్యాశాఖకు సంబంధించి పాఠశాల సముదాయాల స్థానంలో (కాంప్లెక్స్) క్లస్టర్ విధానాన్ని అమలు చేయాలంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సత్తెనపల్లి నియోజకవర్గంలోని సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల పరిధిలో 14 స్కూల్ కాంప్లెక్స్‌లను 12 క్లస్టర్లుగా ఏర్పాటు చేసేలా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రతి క్లస్టర్‌కు గ్రామీణ ప్రాంతాల్లో 10 నుంచి 15 కిలోమీటర్ల పరిధిలో ఉన్న 10 నుంచి 15 పాఠశాలలను అనుసంధానం చేసేలా విద్యాశాఖ మార్గ దర్శకాలు జారీ చేసింది. క్లస్టర్‌లో 40 నుంచి 50 మంది ఉపాధ్యాయులు సభ్యులుగా ఉంటారు. ఇకపై ప్రతి నెల పాఠశాల కాంప్లెక్స్ సమావేశాలు కొత్త విధానంలో నిర్వహించనున్నారు. ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ, పాఠశాలల మధ్య విద్య అనుసంధానం, విద్యా వనరుల సామగ్రి తయారీ, తనిఖీలు, విద్యా వ్యవస్థ పర్యవేక్షణ తదితర కార్యక్రమాలు క్లస్టర్ కేంద్రంగా నిర్వహించేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రధానోపాధ్యాయులే కీలకం

కొత్త విధానంలో క్లస్టర్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు కీలకంగా మారనున్నారు. మండల యూనిట్‌లో ప్రస్తుతం డీడీఓ అధికారాలు మండల విద్యాశాఖాధికారులు (ఎంఈఓ)లకు ఉండగా ఇకపై ఈ విధానానికి స్వస్తి పలికి త్వరలో క్లస్టర్ స్కూల్ ప్రధానోపాధ్యాయులకు జీతాల పంపిణీ అధికారం బదలాయింపు చేయనున్నారు.



పట్టణంలోని సుగాలీకాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు

ఎంఈఓలు పరిపాలన సంబంధ అంశాలకు మాత్రమే పరిమితం కానున్నారు. క్లస్టర్ స్కూల్లో ప్రధానోపాధ్యాయులపై ప్రస్తుతం ఉన్న రోజువారీ విధులకు అదనంగా క్లస్టర్ నిర్వహణ భారం పడటంతోపాటు మండల విద్యాశాఖ అధికారులు నిర్వహిస్తున్న డీడీఓ బాధ్యతలను కూడా క్లస్టర్ ప్రధాన ఉపాధ్యాయులకే ఇచ్చేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

సీఆర్పీల భవిష్యత్తు ప్రశ్నార్థకం

ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే స్కూల్ కాంప్లెక్స్‌లను కూటమి ప్రభుత్వం తగ్గించనుంది. ఈ నేపథ్యంలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్లను కూడా తగ్గించనున్నట్లు తెలుస్తోంది. దీంతో ఇప్పటి వరకు కాంప్లెక్స్‌లో విధులు నిర్వహిస్తున్న సీఆర్పీల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. సీఆర్పీలకు బీఈడీ అర్హత ఉండటంతో గత ప్రభుత్వం క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్లు (సీఆర్ఎంటీ)గా గుర్తింపు ఇవ్వడంతోపాటు మండలంలో ఎక్కడైనా ఉపాధ్యాయులు సెలవులో ఉన్నప్పుడు బోధనకు అంతరాయం లేకుండా వీరు విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంది. ఇప్పుడు క్లస్టర్ విధానం అమల్లో వీరి పరిస్థితి ఏమవుతుందనేది స్పష్టంగా తెలియ రావడం లేదు.

సత్తెనపల్లి నియోజకవర్గంలో ఇలా....

- సత్తెనపల్లి మండలానికి సంబంధించి పణిదం, రెంటపాళ్ళ, బృగుబండ, నందిగం, కొమెరపూడి, పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు కలిపి ఏడు కాంప్లెక్స్‌గా ఉండగా .. ప్రస్తుతం కొమెరపూడిని నందిగామలో విలీనం చేసి ఆరు క్లస్టర్లుగా మార్చారు. బృగుబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదులుగా ధూళిపాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మార్చారు.
- ముప్పాళ్ళ మండలానికి సంబంధించి నార్నెపాడు, ముప్పాళ్ళ, మాదల కలిపి మూడు కాంప్లెక్స్‌లుగా ఉండగా నార్నెపాడును తొలగించి దమ్మాలపాడు, ముప్పాళ్ళ, మాదల మూడింటిని కలిపి క్లస్టర్లుగా మార్చారు.
- రాజుపాలెం మండలానికి సంబంధించి గణపవరం, అనుపాలెం, పెదనెమిలిపురి, రాజుపాలెం పాఠశాలలు కలిపి నాలుగు కాంప్లెక్స్‌లు ఉండగా అనుపాలెంను రాజుపాలెం మండలంలో విలీనం చేశారు.కోటనెమిలిపురి, పార్వతిపురంలోని ఐదు పాఠశాలలను పెదనెమిలిపురిలో విలీనం చేశారు.
- నకరికల్లు మండలానికి సంబంధించి గుండ్లపల్లి, నకరికల్లు, కండ్లకుంట, కుంకలగుంట పాఠశాలలు కలిపి నాలుగు కాంప్లెక్స్‌లుగా ఉండగా వీటిని యథావిధిగా నాలుగు క్లస్టర్లుగా కొనసాగిస్తున్నారు.

వనరుల సమర్థ వినియోగమే లక్ష్యం



కాంప్లెక్స్ స్థానంలో క్లస్టర్ విధానం రావడం వల్ల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణ పెరుగుతుంది. ఉపాధ్యాయులలో నైపుణ్యాలు పెరిగి బోధనకు దోహదపడతాయి. ముఖ్యంగా వనరులను సమర్థంగా వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుంది.

–ఎ.శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి, సత్తెనపల్లి

క్లుప్తంగా

విద్యార్థినికి మంత్రి లోకేష్ అభినందన



మంగళగిరి (తాడేపల్లి రూరల్): తెలుగు టైప్‌రైటింగ్ లోయర్ గ్రేడ్ పరీక్షలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థినిని మంత్రి లోకేష్ అభినందించారు. స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గత ఏడాది సెప్టెంబర్‌లో నిర్వహించిన పరీక్షలో ఆమె ఈ ఘనత సాధించింది. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెంకు చెందిన ఆరాధ్యుల హరితసాయి నగరానికి చెందిన టైప్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపల్ మురళీతో కలిసి తాడేపల్లిలోని నారా లోకేష్ నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను మంత్రి అభినందించారు.

'మా - ఏపీ' గుర్తింపు కార్డులు జారీ



తెనాలి: మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ – ఆంధ్రప్రదేశ్ 24 విభాగాల యూనియన్ (మా-ఏపీ)లో ఆదివారం వివిధ రంగాలకు చెందిన సినీ రంగ కార్మికులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా మాట్లాడుతూ.. గతంలో ఏ శాఖలో ఎవరి దగ్గర పనిచేశారో ఆయా రంగాల సాంకేతిక నిపుణులు ఇచ్చిన అనుభవం సర్టిఫికెట్ల ఆధారంగా గుర్తింపు కార్డులను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్డులను అందుకున్న వారిలో కాస్ట్యూమ్ డిజైనర్లు పట్నాల పార్వతి, శ్రీవిద్య, ఫైటింగ్ డివిజనులో శ్రీధర్, కెమెరామెన్ రాజు తదితరులున్నారు.

పసుపు రైతులకు పరిహారం చెల్లించాలి

తాడేపల్లి రూరల్ : దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ అగ్నిబాధిత పసుపు రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలని ఏపీ పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దుగ్గిరాల గ్రామంలో ఆదివారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అగ్నిప్రమాదంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, పరిహారం చెల్లించాలని అనేక ఉద్యమాలు నిర్వహించినట్లు తెలియజేశారు. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం క్వింటాకు రూ.7 వేల నష్టపరిహారం ఇస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఇవ్వకపోవడంతో బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు. ఇప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

గాయపడిన వారిపై క్రిమినల్ కేసులు హేయమైన చర్య

- దాడి చేసిన టీడీపీ నాయకులకు రక్షణగా పోలీసులు
- తక్షణమే జిల్లా ఎస్పీ జోక్యం చేసుకొని న్యాయం చేయాలి
- అంబేడ్కర్ ప్రజా సంఘం జిల్లా అధ్యక్షుడు దావులూరి కోటేశ్వరరావు


సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శిస్తున్న దావులూరి కోటేశ్వరరావు

సత్తెనపల్లి: తలలు పగిలేటట్లు దాడి చేసి న వారిని వదిలి గాయపడిన క్షతగాత్రులపై పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేయడం హేయమైన చర్య అని అంబేడ్కర్ ప్రజా సంఘం జిల్లా అధ్యక్షుడు దావులూరు కోటేశ్వరరావు, దళిత మహాసభ జిల్లా నాయకులు కొరబండి బాబురావు అన్నారు. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం పెదపాలెం గ్రామంలో ఈనెల 17న రాత్రి సమయంలో గంటెల నారాయణ అనే వ్యక్తి కిరాణా షాప్‌కి వెళ్లి వస్తుండగా అదే గ్రామానికి చెందిన పిల్లి పాల్ తన ద్విచక్ర వాహనంతో ఢీకొట్టడంతో కిందపడ్డ నారాయణ, ఆయన బంధువులపై పిల్లి పాల్, పిల్లి రాజశేఖర్ దాడి చేశారన్నారు. ఈ దాడిలో గంటెల నారాయణతోపాటు గంటెల బాలేసు, గంటెల బాబూరావు, కోపూరి జోజిలు గాయపడ్డారని పేర్కొన్నారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో క్షతగాత్రులు చికిత్స పొందుతుండగా ఆదివారం ప్రజాసంఘాల నాయకులు వారిని పరామర్శించి జరిగిన ఘటన గురించి అడిగి తెలుసు కున్నారు. అనంతరం దావులూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ పెదపాలెంలో జరిగిన గొడవ విషయంపై అడిగే సమయంలో అప్పటికే అక్కడికి చేరుకున్న పాటిబండ్ల బాపిరాజు, అతని అనుచరులు కర్రలు, రాళ్లతో గంటెల నారాయణ, గంటెల బాల యేసు, గంటెల బాబురావు, కోపూరు జోజీలపై విచక్షణ రహితంగా దాడి చేయడమే కాక ఇళ్ళపై దాడి చేసి అసభ్య పదజాలంతో దూషించారన్నారు. గాయాల పాలైన వారు ప్రాణ భయంతో నెత్తుటి మరకలతో సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు చికిత్స నిమిత్తం చేరుకోగా వారి నుంచి పోలీసులు ఎలాంటి సమాచారం సేకరించకుండా దాడి చేసిన టీడీపీ వారికి రక్షణగా నిలిచి గాయపడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. దాడి చేసిన వారు టీడీపీ సానుభూతిపరులు కావడంతో వారికి పోలీసులు అండగా నిలుస్తున్నారని, పోలీసుల ఏకపక్ష తీరు సరైన కాదన్నారు. ఒకే సామాజిక వర్గం వారిని వైఎస్సార్ సీపీ, టీడీపీగా విభజించి వైఎస్సార్ సీపీ వారికి అన్యాయం చేయడం తగదన్నారు. తక్షణమే జిల్లా ఎస్పీ జోక్యం చేసుకొని తీవ్ర గాయాల పాలైన గంటెల నారాయణ, బాలేసు, బాబురావు, జోజిలకు న్యాయం చేయాలని కోరారు. పోలీసులు ఏకపక్షంగా గాయపడిన వారిపై కేసులు నమోదు చేస్తే ఆందోళన చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. వారితో పాటు ప్రజా సంఘాల నేతలు ఉన్నారు.

వేంకటేశ్వరశర్మకు జాతీయ పురస్కారం


జాతీయ పురస్కారాలతో వేంకటేశ్వరశర్మ

అచ్చంపేట: గింజుపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ అర్చక ఆధ్యాత్మిక పండితులు రెంటాల వేంకటేశ్వర శర్మను ఆర్వాణి సకల కళావేదిక, కరీంనగర్‌వారు జాతీయ పురస్కారానికి ఎంపిక చేశారు. కరీంనగర్‌లో ఆదివారం జరిగిన పురస్కార సభలో ఆర్వాణి సకల కళావేదిక ప్రతినిధి డాక్టర్ దూడపాక శ్రీధర్ నుంచి శర్మ పురస్కారాన్ని అందుకున్నారు. వేంకటేశ్వరశర్మ మాట్లాడుతూ తన తండ్రి సత్యనారాయణ ద్వారా అర్చక ఆధ్యాతిక జ్యోతిష్య రంగాన్ని వారసత్వంగా పొందానన్నారు. ఈ రంగాలలో తాను చేసిన కృషిని గుర్తించిన ఆర్వాణి సకల వేదిక ప్రముఖులు 2025 సంక్రాంతి జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేశారన్నారు. వారి చేతులమీదుగా పురస్కారాన్ని అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీత వేంకటేశ్వరశర్మను మాదిపాడు, గింజుపల్లి గ్రామాల వైఎస్సార్ సీపీ ప్రముఖులు సర్పంచ్ మాదా ఈశ్వరమ్మ, వారి భర్త వెంకట్రావు, ఎంపీటీసీ భూక్యా స్వర్ణమ్మ వారి భర్త రమేష్ నాయక్, జిల్లా ఆర్య వైశ్య ప్రముఖులు దేవ రశెట్టి శ్రీనివాసరావు, ఆర్‌యంపి వైద్యులు షేక్ కరీం, కొరివి వెంకటనరేష్, చిట్యాల దావీదు, నంద్యాల బ్రహ్మారెడ్డి, మునగాల హనుమంతరావు తదితరులు అభినందించారు.

ఏప్రిల్‌లో జాతీయస్థాయి నాటికల పోటీలు


పోటీల వివరాలు తెలుపుతున్న డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు

యడ్లపాడు: పుచ్చలపల్లి సుందరయ్య కళా నిలయం జాతీయస్థాయి ఆహ్వాన నాటికల పోటీలు ఈ ఏడాది ఏప్రిల్ 4,5,6 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు తెలిపారు. ఆదివారం ఆయన నివాసంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. సురేష్‌బాబు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య పేరిట ప్రతి సంవత్సరం యడ్లపాడులో పండగ వాతావరణంలో నిర్వహించడం దశాబ్దాల నుంచి ఆనవాయితీగా వస్తుందన్నారు. ఏప్రిల్ మాసంలో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. పోటీల నిర్వహణ ప్రతిసారీ విభిన్న తరహాలో నిర్వహించాలనే సంకల్పంతో కమిటీ సభ్యులు ఉన్నట్లు వెల్లడించారు. త్వరలోనే నాటికల స్క్రూటీన్లు చేసి ఉత్తమోత్తమ వాటిని తమ వేదికపై ప్రదర్శించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సంస్థ కార్యదర్శి ముత్తవరపు రామారావు, పోపూరి నాగేశ్వరరావు ఉన్నారు.

కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి విజయకుమార్


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు విజయకుమార్

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం కోటప్పకొండ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఏపీ మోడల్ స్కూలులో పనిచేసే ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దీనికి ఏపీ మోడల్ స్కూల్ అటెండర్, వాచ్‌మెన్ ఔట్‌సోర్సింగ్ యూనియన్ గౌరవాధ్యక్షులు వినుకొండ పేరయ్య అధ్యక్షత వహించారు. విజయకుమార్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగులకు మాత్రమే మినిమమ్ టైమ్‌స్కేలు ఇచ్చి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అమలు చేయకుండా వదిలేయటాన్ని తీవ్రంగా ఖండించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి షేక్ సిలార్ మసూద్ మాట్లాడుతూ మోడల్‌స్కూలులో పనిచేసే అటెండర్లు, వాచ్‌మెన్‌లకు స్వీపర్లకు ఔట్ సోర్సింగ్ విధానం తొలగించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పౌరహక్కుల సంఘ సంయుక్త కార్యదర్శి శిఖినం చిన్న, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, పీకేఎస్ జిల్లా కార్యదర్శి కంబాల ఏడుకొండలు, రైతుసంఘ నాయకులు గోపాలరావు, యూటీఎఫ్ నాయకులు షేక్ షరీఫ్, అంకమ్మ చౌదరి, ఔట్‌సోర్సింగ్ యూనియన్ నాయకులు ఎం.చిన్నయ్య, ఉయ్యాల మహేష్‌బాబు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో 24 మందికి పతకాలు

తెనాలి అర్బన్: తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో తెనాలికి చెందిన కేఎస్ఆర్ తైక్వాండో అకాడమీకి చెందిన 23 మందికి పతకాలు లభించాయి. ఈ మేరకు కోచ్ కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. వీరిలో 10 మందికి బంగారు, తొమ్మిది మందికి వెండి, ఐదుగురికి కాంస్య పతకాలు లభించినట్లు చెప్పారు. పోటీలను బాపట్ల జిల్లా రేపల్లెలోని శ్రీవాసవీ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఈ నెల 11, 12వ తేదీలలో నిర్వహించినట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు పతకాలను ఆదివారం అకాడమీలో అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో వీరవల్లి మురళి, సర్పంచ్ కె.నాగభూషణం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రైలు ఎక్కుతూ కిందపడి వ్యక్తి మృతి


రెంటచింతలలో రైలు ఎక్కుతూ కిందపడి మృతి చెందిన తమ్మిశెట్టి ఏడుకొండలు


మృతుడు తమ్మిశెట్టి ఏడుకొండలు(ఫైల్)

రెంటచింతల: స్థానిక రైల్వేస్టేషన్లో రైలు ఎక్కుతూ ఓ వ్యక్తి కిందపడి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం ఉదయం జరిగింది. మండలంలోని పాత పాలువాయి గ్రామానికి చెందిన తమ్మిశెట్టి ఏడుకొండలు(46) ఈ ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. గుంటూరులో చదువుతున్న ఏడుకొండలు కొడుకు శ్యామ్, కుమార్తె శ్రావణి సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చారు. వారితో కలిసి గుంటూరు వెళ్లేందుకు రెంటచింతలలో రైలు ఎక్కుతున్న సమయంలో ఏడుకొండలు కాలుజారి ప్రమాదవశాత్తు రైలు కిందపడి మృతిచెందాడు. అధిక సంఖ్యలో ప్రయాణికులు ఒక్కసారిగా రైలు ఎక్కేందుకు యత్నించడం వలన ఈ ప్రమాదం జరిగినట్లు కొందరు ప్రయాణికులు తెలిపారు. విషయం తెలుసుకున్న రైల్వే ఎస్ఐ వెంకట్రావ్, పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను సేకరించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పంచనామ నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు ఏడుకొండలు గ్రామంలో ముఠామేస్త్రీగా పని చేస్తుంటాడు. మృతునికి భార్య పద్మ, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

లౌకిక శక్తులు ఏకం కావాలి

ఆవాజ్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి


నినాదాలు చేస్తున్న చిష్టి, నళినీ కాంత్, జిల్లా కమిటీ సభ్యులు

లక్ష్మీపురం: కేంద్రం వైఖరిపై పోరాటానికి లౌకిక శక్తులు ఏకం కావాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ చిష్టి అన్నారు. పాత గుంటూరులోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఆవాజ్ కమిటీ గుంటూరు జిల్లా విస్తృత స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షుడు బాషా అధ్యక్షతన జరిగింది. ఇందులో చిష్టి మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా మైనారిటీలకు ఇచ్చిన ప్రత్యేకమైన హామీలు, సూపర్ 6 అమలు కోసం గట్టిగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు నళినీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో చాపకింద నీరులా జనసేనను అడ్డుపెట్టుకొని బీజేపీ తన మతోన్మాద ఎజెండాను అమలు పరచాలని చూస్తోందని ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. అంబేడ్కర్‌ను అవమాన పరుస్తూ అమిత్ షా పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగం పట్ల వారి వైఖరి, మతోన్మాదంపై వారి నిబద్ధతకు నిదర్శనమన్నారు. ప్రస్తుతం రాజ్యాంగమే ప్రమాదంలో పడిందని చెప్పారు. దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశంలో ప్రతి పౌరుడికి ఉందన్నారు. చట్టసభల్లో సామాన్యుల గొంతుకగా ఉన్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు తిరిగి గెలిపించుకోవాలని కోరారు. అనంతరం 12 మందితో ఏర్పాటైన నూతన కమిటీకి అధ్యక్ష, కార్యదర్శులుగా సుభాని, బాషాలను ఎన్నుకున్నారు.

జీజీహెచ్ కార్యాలయ అధికారి, సిబ్బందిపై చర్యలు

- ఆస్పత్రిలో సిబ్బందిలో ఆందోళన
- రిక్రూట్‌మెంట్‌లో నిబంధనలు పాటించలేదని ఫిర్యాదులు
- విచారణ చేసి చర్యలకు ఆదేశించిన డీఎంఈ కార్యాలయం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ చింతలపూడి నాగేశ్వరావుపై వచ్చిన ఆరోపణలు విచారణ చేసిన అనంతరం ఆస్పత్రిలోని పలువురు కార్యాలయ అధికారులు, కార్యాలయ సిబ్బందిపై చర్యలకు ఆదేశాలు జారీ అయ్యాయి. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) కార్యాలయం నుంచి గుంటూరు జీజీహెచ్‌కు ఉత్తర్వులు రావటంతో ఆస్పత్రి కార్యాలయ అధికారులు, ఉద్యోగుల్లో ఆందోళన ప్రారంభమైంది.

ఫిర్యాదుతో విచారణ

గుంటూరుకు చెందిన డీఎస్‌బీ కోటేశ్వరరావు 2023లో గుంటూరు జీజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ చింతలపూడి నాగేశ్వరరావుపై పలు ఆరోపణలు చేస్తూ లిఖిత పూర్వకంగా డీఎంఈ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. డైట్ కాంట్రాక్ట్ ఫైల్ మాయం చేశారని, ముఖ్యంగా కోవిడ్ డైట్ ఫైల్ మాయం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు, ఇతర వైద్య సిబ్బంది రిక్రూట్‌మెంట్ నియామకాల్లో నిబంధనలు పాటించలేదని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు ఎక్కువ మొత్తంలో చెల్లించారని, వేతనాలు చెల్లింపులో ఉద్యోగుల్లో కొంత మందికి మాత్రమే ఎక్కువ మొత్తంలో చెల్లించి వివక్ష చూపించారని, నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో రిక్రూట్‌మెంట్‌లో నిబంధనలు పాటించలేదని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులపై డీఎంఈ కార్యాలయం అధికారులు మూడుసార్లు ఇతర జిల్లాలకు చెందిన అధికారులను విచారణ కమిటీగా నియమించి విచారణ చేయించారు. అధికారులు జీజీహెచ్‌కు వచ్చి కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ చింతలపూడి నాగేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్స్ వై.లక్ష్మీ సామ్రాజ్యం, ఎ.గోపీనాథ్, జి.మనోరమ, ఫిర్యాదు చేసిన కోటేశ్వరరావులను విచారించి డీఎంఈకి నివేదిక ఇచ్చారు. విచారణ అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం డీఎంఈ కార్యాలయం అధికారులు గుంటూరు జీజీహెచ్ సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పలు సూచనలు డీఎంఈ కార్యాలయం ఆస్పత్రి అధికారులకు చేసింది.

ఇక నుంచి సెలక్షన్ కమిటీ

ఇక నుంచి ఆస్పత్రిలో చేసే ఉద్యోగ నియామకాలన్నీ తప్పనిసరిగా జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా మాత్రమే చేపట్టాలని డీఎంఈ కార్యాలయం తెలిపింది. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు అధిక మొత్తంలో వేతనాలు చెల్లించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, స్టాఫ్‌నర్సు రిక్రూట్‌మెంట్‌లో నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని, కోవిడ్ డైట్ ఫైల్ మాయం చేసిన ఎల్.శ్రీనివాసరావుపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డీఎంఈ కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. జీజీహెచ్‌లో ఎమ్మారై స్కానింగ్ కాంట్రాక్టర్ ఆర్‌కే డయాగ్నోస్టిక్ ప్రైవేట్ లిమిటెడ్, క్యాథ్‌ల్యాబ్ కాంట్రాక్టర్ లక్ష్మీఆరుష్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ వారి వద్ద నుంచి విద్యుత్ బిల్లులను 30 రోజుల్లోగా వడ్డీతో సహా తీసుకోవాలని ఆదేశించారు. అసిస్టెంట్ డైరెక్టర్ చింతలపూడి నాగేశ్వరరావుపై వచ్చిన ఆరోపణలను విచారించిన జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారి డి.మనోరమ విచారణ నివేదికను అందజేయాలని ఆదేశించారు. దీంతో ఆస్పత్రిలో పనిచేస్తున్న పలువురు కార్యాలయ అధికారులు, ఉద్యోగులు ఎవరిపై వేటు పడుతుందో అనే భయాందోళనలో ఉన్నారు. కాగా డీఎంఈ కార్యాలయం ఉత్తర్వులపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణను సాక్షి వివరణ కోరగా తమ కార్యాలయానికి ఇంకా ఉత్తర్వులు రాలేదని, ఉత్తర్వులు వచ్చిన వెంటనే డీఎంఈ ఆదేశాల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

బోర్‌వెల్స్ ఆఫీసులో పేలిన సిలిండర్


సిలిండర్ పేలి ధ్వంసమైన బోర్‌వెల్స్ కార్యాలయం

నాదెండ్ల: జాతీయ రహదారిపై గణపవరం గ్రామ పరిధిలోని శివ ప్రియనగర్ సమీపంలో విద్యాధరి బోర్‌వెల్స్ ఆఫీసులో వంట చేస్తుండగా సిలిండర్ పేలి అగ్నిప్రమాదం జరిగింది. బోర్‌వెల్స్ యజమాని కె.అనంతయ్య తెలిపిన వివరాల మేరకు సాయంత్రం 5 గంటల సమయంలో బోర్‌వెల్స్ ఆఫీసులో ఉండే కూలీలు వంటకు ఉపక్రమించారు. ఒక్కసారిగా రెగ్యులేటర్ వద్ద గ్యాస్ లీకై మంటలు అంటుకున్నాయి. సిలిండర్ పేలటంతో ఆఫీసు గది ధ్వంసమైంది. కూలీల దుస్తులు, వంటసామగ్రి కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న చిలకలూరిపేట ఫైర్ ఆఫీసర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎల్ఎఫ్ వెంకయ్య, సిబ్బంది రాము, పూర్ణచంద్రరావు, కేఎల్ఎన్ రాజు అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలుకాలేదు.

కృష్ణానదిలో వ్యక్తి మృతి


మృతుడు మర్రి రాముడు

అచ్చంపేట: కృష్ణానదిలో స్నానం చేయడానికి వెళ్లిన వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని పుట్లగూడెంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మర్రి రాముడు (32) తిరుపతమ్మ తల్లి మాల వేసుకుని దీక్ష పొందాడు. రోజూలాగే సాయంత్రం 5 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన మరో ముగ్గురు మాల ధారణ చేసిన వారితో కలసి కృష్ణానదిలో స్నానం చేయడానికి వెళ్లాడు. నలుగురు స్నానం చేస్తుండగా రాముడు నదిలోతుల్లోకి వెళ్లి స్నానం చేస్తుండగా మునిగిపోయాడు. మిగిలినవారు రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. విషయం తెలుసుకున్న అచ్చంపేట సీఐ వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టి రాత్రి 8 గంటల సమయంలో మృతదేహాన్ని వెలికి తీశారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి తరలించనున్నట్లు సీఐ తెలిపారు. రాముడుకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

సీఏ విద్యార్థి ఆత్మహత్య

లక్ష్మీపురం: హాస్టల్‌లో సీఏ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా గూడూరు ప్రాంతానికి చెందిన ప్రభాకర్‌రాజు ఉపాధ్యాయుడు. ఆయన కుమారుడు కె.నాగప్రసాద్ (27) బ్రాడీపేటలోని లోటస్ ప్రైమ్ బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. సీఏ చేస్తున్నాడు. శనివారం రాత్రి 9 గంటలకు నాగప్రసాద్‌తో రూమ్‌లో ఉండే మరో విద్యార్థి వచ్చి గది తలుపులు వేసి ఉండటంతో పిలిచాడు. అతడు పలకలేదు. దీంతో స్నేహితుడి రూమ్‌కు వెళ్లాడు. మరునాడు మధ్యాహ్నం అనుమానం వచ్చి హాస్టల్ నిర్వాహకులకు తెలియజేశాడు. వారు వచ్చి చూసేసరికి నాగప్రసాద్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై

బీమా ప్రీమియంపై జీఎస్టీ రద్దుకు డిమాండ్


మాట్లాడుతున్న వీవీకే సురేష్

కొరిటిపాడు(గుంటూరు): బీమా ప్రీమియంపై కేంద్ర ప్రభుత్వం 18 శాతం జీఎస్టీని వెంటనే ఉపసంహరించాలని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి వీవీకే సురేష్ డిమాండ్ చేశారు. గుంటూరు అరండల్‌పేటలోని ఎల్ఐసీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య బీమా ప్రీమియంపై జీఎస్టీ విధించడం వల్ల కోట్లాది మంది ఈ సౌకర్యాన్ని పొందలేకపోతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని ఎత్తివేయని పక్షంలో ఏజెంట్స్, పాలసీదారుల సహకారంతో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీమా రంగాన్ని మరింత శక్తిమంతం చేస్తే జీడీపీలో ప్రీమియం వాటా పెరుగుతుందని చెప్పారు. ప్రీమియంలపై విధిస్తున్న జీఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 300 మందికిపైగా ఎంపీలు, అనేక మంది కేంద్ర మంత్రులను కలసి వినతిపత్రాలను అందజేసినట్లు తెలిపారు. అసోసియేషన్ నాయకులు జానీ మాట్లాడుతూ ప్రజాసంక్షేమానికి ఎల్ఐసీ అంకితమైందని స్పష్టం చేశారు. అసోసియేషన్ నాయకురాలు సీహెచ్ మధుబాల మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం బీమా రంగంలో విదేశీ వాటాను వంద శాతానికి పెంచాలని నిర్ణయించిందని అన్నారు. ఎల్ఐసీని కాపాడుకునేందుకు ఉద్యోగులు, ఏజంట్లు పోరాటం కొనసాగిస్తారన్నారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు నాగేంద్రరెడ్డి, గోపాలకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే పురస్కారాలు ప్రదానం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ఉత్తమ బోధకులకు సావిత్రిబాయి పూలే జాతీయ ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. సదరన్ ప్రైవేటు లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ (ఎస్పీఎల్‌టీఓ) ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు మార్కెట్ సెంటర్‌లోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎస్పీఎల్‌టీవో వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీ, తెలంగాణలకు చెందిన 181 మంది పురస్కారాలను అందుకున్నారు. మలినేని విద్యాసంస్థల చైర్మన్ మలినేని పెరుమాళ్లు, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ అంగలకుదురు గాయత్రీదేవి, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు, బయోటెక్నాలజీ ప్రొఫెసర్ కె.వసుంధరలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏఎన్‌యూ పాలకవర్గ సభ్యుడు, కన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.కన్న మాస్టరు, అప్సా సంయుక్త కోశాధికారి కాటూరి వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ.. మహిళా విద్య కోసం సావిత్రిబాయి పూలే చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ఏసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొమ్మాలపాటి మోజెస్, ఏసీ న్యాయ కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి.రాణి అమృత వర్షిణి, లాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ ప్రిన్సిపల్ అమీనాబేగం, ఆర్గనైజేషన్ కార్యనిర్వాహక అధ్యక్షులు కె.గోవిందరాజులు, కొండపల్లి విల్సన్, కన్వీనర్ పీఆర్ రత్నకుమార్, ఎస్‌వీఎస్ రఘు ప్రదీప్, కార్యదర్శి ఎం. రాకేష్, పీఎస్ ఆదిత్య, మహిళా సమన్వయకర్త డి.నాగమణి, కన్వీనర్ ఎస్పీ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో యువకుడు గల్లంతు


చాట్ల బాలు (ఫైల్)

తాడేపల్లి రూరల్ : కృష్ణానది నీటిలో ఓ యువకుడు ఆదివారం గల్లంతయ్యాడు. కృష్ణానది ఎగువ ప్రాంతంలోని ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. విశాఖ జిల్లా భీమునిపట్నం, నేరెళ్ల వలసకు చెందిన చాట్ల బాలు (18) కుటుంబం విజయవాడకు వచ్చి కూలీ పనులు చేసుకుంటోంది. ఆదివారం సెలవు కావడంతో స్నేహితులతో ఈతకని వచ్చి నీటిలోకి దిగారు. బాలు మునిగిపోవడంతో స్నేహితులు కేకలు వేశారు. చుట్టుపక్కల వారు వెతికినా ప్రయోజనం కనిపించలేదు. తాడేపల్లి పోలీసులు, మంగళగిరి అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. అతడి బంధువులు, స్నేహితులు నది వద్దకు వచ్చి బాలు ఆచూకీ కోసం ఎదురు చూశారు.